# సాక్షి
## కాకినాడ

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024






### ఆదిలోనే హంసపాదు

ఆదిలోనే హంసపాదు అన్నట్టు.. సత్యదేవుని నూతన ప్రారంభమైన వేళ.. సాంకేతిక పరమైన ఆటంకాలతో స్వామివారి ఊరేగింపును అధికారులు వాయిదా వేశారు. - IIలో



### లక్ష్మీ నృసింహుని కల్యాణోత్సవాలకు శ్రీకారం

అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి వార్షిక దివ్య తిరుకల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. - IIలో

### 8,300 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కులు చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులుగా ఉంది.

## న్యూస్‌రీల్

### రాజరాజేశ్వరీదేవికి వెండిచీర సమర్పణ



అధికారులకు వెండి చీర, ఇతర వస్తువులు అందజేస్తున్న భక్తులు

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో వేంచేసిన రాజ రాజేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు శుక్రవారం వెండి చీర, వక్షస్థలం, కిరీటం, హస్తాలు, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడి పీఠాలను సమర్పించారు. తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన డాక్టర్ కంచి చంద్రయ్య, డాక్టర్ నందినీరాణి దంపతులు 8.50 కిలోల వెండితో వీటిని తయారు చేయించి, సమర్పించారని ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. ఆ వెండి వస్తువులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు.

### జాబ్‌మేళాకు 940 మంది హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు 940 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 14 కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ మేళా ద్వారా వచ్చే ఉద్యోగావకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐటీఐ ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ మాట్లాడుతూ, వేతనం గురించి చూడకుండా తొలుత ఒక సంస్థలో చేరి నైపుణ్యం పెంచుకుంటే అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి చేరవచ్చని అన్నారు. జిల్లా నైపుణ్య సంస్థ అధికారి హరిశేషు మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన వారికి అన్ని రంగాల్లోనూ శిక్షణ ఇస్తున్నామని, తద్వారా వందలాది మంది ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. కోనసీమ జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి నెలా రెండు మేళాలు నిర్వహిస్తున్నామని, 60 శాతం మహిళలు రావడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్లూమ్ అధికారి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

### 19 జాబ్‌మేళా

కాకినాడ సిటీ: తమ కార్యాలయంలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిక్సా వరుణ్ మోటార్స్‌లో రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఇవాల్యుయేటర్, డ్రైవర్లు, వాషర్లు, ఆఫీస్ బాయ్స్; ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో కస్టమర్ సర్వీస్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు, ఎస్‌బీఐ కార్డ్స్(టీమ్‌లీజ్)లో బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, కేఎఫ్‌సీలో టీమ్ మెంబర్లు, బ్రాండ్ బుజ్ కంపెనీలో కస్టమర్ సపోర్టు ఎగ్జిక్యూటివ్, సోషల్ మీడియా మార్కెటింగ్ మేనేజర్లు, నిట్(ఐసీఐసీఐ బ్యాంక్)లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ ప్రొడక్షన్, డిక్సన్ కంపెనీలో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, డిగ్రీ ఉత్తీర్ణులైన 30 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం, ఉద్యోగాన్ని బట్టి ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

# అమృతవర్షిణి



- రాష్ట్రంలోనే తల్లి పాల తొలి బ్యాంకు సక్సెస్
- జీజీహెచ్‌లో ఫలించిన ప్రయోగం
- 3,60,114 మిల్లీ లీటర్ల పాల సేకరణ
- ఏడాదిలో 1,350 మంది శిశువులకు సాంత్వన



కాకినాడ జీజీహెచ్‌లోని తల్లి పాల నిధి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అమ్మ 'గర్భ'గుడి నుంచి తొలిసారి ఈ లోకానికి వచ్చిన శిశువుకు.. ఆ తల్లి పాలే అమృతపు జల్లు. అవే ఆ బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి దివ్యౌషధం.. శ్రీరామరక్ష. అమృత తుల్యమైన అటువంటి తల్లి పాలు దొరకక నవజాత శిశువులు మరణిస్తున్న సందర్భాలు అనేకం. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎంతో మంది చిన్నారులకు పోతపాలే దిక్కవుతున్నాయి. అటువంటి అభాగ్య చిన్నారుల కోసం రాష్ట్రంలోనే తొలిసారిగా కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి(జీజీహెచ్)లో ప్రారంభించిన ప్రవేశపెట్టిన తల్లి పాల నిధి (బ్యాంకు) ప్రయోగం విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రసవాలు జరిగే టాప్–5 ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాకినాడ జీజీహెచ్ ఒకటి. ఈ నేపథ్యంలో ఇక్కడ సరిగ్గా ఏడాది క్రితం రాష్ట్రంలోనే మొట్టమొదటి తల్లి పాల నిధిని 'ధాత్రి' పేరిట సుషేణ హెల్త్ ఫౌండేషన్ ప్రారంభించింది. ఇటువంటి బ్యాంకుల్లో ఇది దేశంలోనే ఎనిమిదోది కావడం విశేషం. అసలు ఇక్కడ ఈ బ్యాంకు ఏవిధంగా నడుస్తుంది, తల్లి పాలు సేకరించడం, వాటిని నిల్వ చేయడం, తల్లి పాలు లేని, ఇవ్వలేని శిశువులకు దానం చేయడం ఎలా సాధ్యమవుతుందని వైద్యుల నుంచి కూడా అనేక ప్రశ్నలు ఎదురయ్యాయి. గడచిన ఏడాది కాలంలో వాటన్నింటికీ సమాధానాలు దొరికాయి. ఈ సంవత్సర కాలంలో తల్లి పాలకు దూరమైన ఎంతో మంది చిన్నారులకు ఈ బ్యాంకు 'అమృత'వర్షిణే అయ్యింది.

### తొలి దశ విజయవంతం



తల్లి పాల ప్రయోజనాన్ని శిశువుకు అందించడంలో ధాత్రి సంస్థ ఎనలేని కృషి చేస్తోంది. ఎందరో తల్లులు తమకు పాలు రాకపోవడంతో డబ్బా పాలపై ఆధారపడుతున్నారు. ఫార్ములా మిల్క్‌ను మించిన ప్రయోజనాన్ని తల్లి పాలు అందిస్తాయి. ఏడాది కాలంలో తొలి దశను విజయవంతంగా నిర్వహించారు. శిశువుకు సొంత తల్లిపాలు ఇవ్వడమే మొదటి దశ. ఈ స్థితిలో తల్లికి పాలు ఉత్పత్తి అయ్యేలా అన్ని చర్యలూ తీసుకుంటారు. ధాత్రికి మరింత సహకారం అందిస్తాం.

– డాక్టర్ మాణిక్యాంబ, పీడియాట్రిక్స్ విభాగాధిపతి, జీజీహెచ్, కాకినాడ

### నూరు శాతం స్వచ్ఛతతో పాల సేకరణ



వేర్వేరు తల్లుల నుంచి వేర్వేరు శిశువులకు పాలు అందించడం వచ్చే నెల మొదటి వారం ప్రారంభం కానుంది. పూర్తి స్టెరిలైజేషన్ విధానాన్ని అనుసరించి పాల స్వచ్ఛతను నూరు శాతం నిర్ధారించుకున్న తర్వాతే ఈ పాలను శిశువులకు పట్టిస్తారు. తల్లి నుంచి విడుదలవుతున్న అదనపు పాలను సేకరించి శుద్ధి చేసి పాశ్చరైజేషన్ చేస్తారు. ఏడాది కాలంలో ఎందరో తల్లుల నుంచి వారి శిశువులకు పాలను అందించగలిగారు.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

### అమ్మకు మించి ఆదుకుంటూ..

తల్లులు ఒకచోట, నవజాత శిశువులు ఐసీయూల్లో ఉన్న సందర్భాల్లో అమ్మకు మించిన పోషణను అందిస్తూ చిన్నారులను తల్లి పాల బ్యాంకు ఆదుకుంటోంది. ఉమ్మడి జిల్లాలో వివిధ కారణాలతో తల్లి పాలకు దూరమవుతున్న శిశువుల సంఖ్య 10 వేలు పైనే ఉంది. గత ఏడాది లెక్కలు తీస్తే ఒక్క కాకినాడ జిల్లాలోనే ఈ సంఖ్య 4 వేల పై చిలుకు ఉంది. తల్లి పాల లోపంతో నీళ్ల విరేచనాలు, న్యుమోనియా, రొమ్ము కాన్సర్ వంటి వాటికి గురవుతున్న అమ్మల సంఖ్య కూడా ఆందోళన కలిగిస్తోందని వైద్యులు చెబుతున్నారు. బిడ్డకు పాలు ఇవ్వలేని పరిస్థితుల్లో తలెత్తే అనుబంధ అనారోగ్య సమస్యలపై ఏటా రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని అంటున్నారు. ఈ పరిస్థితులన్నింటినీ చక్కదిద్ది, శిశువులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లి పాల బ్యాంకు ఉపయుక్తంగా ఉంది. జీజీహెచ్ చంటిపిల్లల విభాగాధిపతి డాక్టర్ మాణిక్యాంబ ఆధ్వర్యాన డాక్టర్ వి.విజయభాస్కర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రాంబాబుల బృందం ప్రత్యేక పర్యవేక్షణలో ఈ బ్యాంకును నిర్వహిస్తున్నారు. ఇందులో ఇద్దరు ల్యాక్టేటింగ్ కౌన్సిలర్లు, ఓ మేనేజర్ సేవలందిస్తుండగా.. చంటి పిల్లల విభాగం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోంది.




మసాజ్ థెరపీ ద్వారా తల్లిలో పాల ఉత్పత్తికి సహకరిస్తున్న ల్యాక్టేటింగ్ కౌన్సిలర్

### అవగాహన కల్పిస్తూ..

శరీరాకృతి మారిపోతుందనే అపోహతో కొంత మంది తల్లులు బిడ్డలకు పాలు ఇవ్వడం లేదు. పోత పాలతోనే బిడ్డ ఆకలి తీరుస్తున్నారు. ఈ కారణంగా బిడ్డల్లో ఎదుగుదల లోపించడంతో పాటు వారి ఆరోగ్యం కూడా దెబ్బ తింటోంది. ఈ పరిస్థితులపై తల్లులకు అవగాహన కల్పించడమే కాకుండా తల్లి పాలు లభించని శిశువులకు వాటిని నిల్వ చేసి, అందించే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటుతో సుషేణ హెల్త్ ఫౌండేషన్ చేపట్టింది. ఏడాది కాలంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ తల్లి పాల ప్రాధాన్యం, వాటిని నిల్వ చేసి శిశువులకు దానం చేయడంపై విస్తృత అవగాహన కల్పిస్తోంది. ప్రసూతి వార్డుల్లో తల్లులకు కౌన్సెలింగ్ నిర్వహించి పాలు ఉత్పత్తి కాని వారిని తొలి దశలో గుర్తిస్తున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో ప్రసవాలు చేయించుకుంటున్న తల్లులు పాలు ఇవ్వలేని పరిస్థితుల్లో వారి నుంచి ఆ పాలను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సేకరిస్తున్నారు. ఈ పాలను ఆరు నెలల పాటు నిల్వ చేసేలా ఏర్పాట్లు చేశారు. సేకరించిన తల్లి పాలను తొలి దశలో వారి శిశువులకే అందజేస్తున్నారు. ఈవిధంగా గడచిన ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం సహా ఇతర ప్రాంతాల నుంచి 3,60,114 మిల్లీ లీటర్ల తల్లి పాలు సేకరించారు. వీటిని తల్లి పాలు పొందలేని 1,350 మంది శిశువులకు అందించారు. ఈ తల్లి పాల బ్యాంకును 6,081 మంది తల్లులు సందర్శించారని అంచనా. మలి దశలో ఇతరుల పిల్లలకూ దానం చేసే ప్రక్రియను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### తన వెలుగులు తన పైనే..



ఆకాశ వీధుల్లో విహరిస్తూ.. లోకం చీకట్లను పారదోలే ప్రత్యక్ష భగవానుడు ఆ సూర్యనారాయణుడు. కంటికి కనిపిస్తూనే.. అందనంత దూరాన ఉన్న ఆ స్వామి.. తన భక్తుల పూజలు అందుకునేందుకు ఈ పుడమిపై వివిధ ఆలయాల్లో అర్చామూర్తిగా కొలువుదీరాడు. అలా ఆ స్వామి వేంచేసిన దివ్యధామం గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం. ఇక్కడ కొలువు దీరిన తన మూర్తి పైనే.. నింగి వీధుల్లోని ఆ సూర్యనారాయణుడు.. రథసప్తమి పర్వదినమైన శుక్రవారం నాటి ప్రభాత సమయంలో తన కిరణాలను ప్రసరించాడు. ఈ అపురూప దృశ్యాన్ని వీక్షించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు.

– పిఠాపురం

# కల్యాణం.. కమనీయం..

- వైభవంగా శ్రీనివాస కల్యాణం
- కాకినాడలో ఉట్టిపడిన ఆధ్యాత్మికత
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కాకినాడ: పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవం వైభవోపేతంగా సాగిన వేళ.. స్థానిక రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానం గోవింద నామస్మరణతో మార్మోగింది. లోక కల్యాణార్థం కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ వేలాదిగా తరలి వచ్చిన అశేష భక్తజనుల సమక్షంలో పద్మావతి శ్రీనివాసుల కల్యాణోత్సవం శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కన్నుల పండువగా సాగింది. కల్యాణోత్సవ ప్రాంగణాన్ని తిరుమల శ్రీవారి ఆలయం నమూనాలో సుందరంగా తీర్చిదిద్దారు. సుమారు 125 అడుగుల వెడల్పున ఏర్పాటు చేసిన వేదిక, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. ఓం నమో వేంకటేశాయ.. గోవిందా... గోవిందా.. అంటూ భక్తులు భక్తిపారవశ్యంతో నినదిస్తూ కల్యాణోత్సవాన్ని తిలకించి, తరించారు.

### శాస్త్రోక్తంగా..

ప్రఖ్యాత ఆగమ పండితులు, భాగవతోత్తములు గోపినంబాల శేషాచార్యులు, పాంచరాత్ర ఆగమ పండితులు గోపినంబాల కూర్మాచార్యుల మనుమ ల ఆధ్వర్యాన కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. తిరుమల వేద విద్యార్థులతో పాటు శ్రీకూర్మం, బొబ్బిలి వేణుగోపాలస్వామి వంటి ఆలయాల ప్రధానార్చకుల వేదమంత్రాలతో కల్యాణోత్సవ ప్రాంగణం ప్రతిధ్వనించింది. ప్రముఖ వయోలిన్, మృదంగ విద్వాంసుల కచేరీ, అన్నమయ్య కీర్తనలు, వేదనాదంతో కల్యాణోత్సవ ప్రాంగణంలో ఆధ్యాత్మిక కెరటం ఎగసింది. విష్వక్సేనారాధనతో కల్యాణ క్రతువుకు పండితులు శ్రీకారం చుట్టారు. పుణ్యాహవాచనం, చతుర్వేద పురుష ఆవాహనం, రక్షాసూత్ర ధారణ, ఎదుర్కోలు ఉత్సవం, యజ్ఞోపవీత ధారణ, జీలకర్ర, బెల్లం, కన్యాదానం వంటి అన్ని క్రతువులనూ శాస్త్రోక్తంగా, కళ్లకు కట్టేలా నిర్వహించారు. మంగళసూత్రధారణ, పుష్పాభిషేకాన్ని భక్తులు భక్తిప్రపత్తులతో తిలకించారు. పద్మావతి అమ్మవారిని పద్మశాలీలు తమ ఆడపడుచుగా కొలుస్తున్న నేపథ్యంలో పద్మావతీ శ్రీనివాసులకు సంప్రదాయ పద్ధతిలో సారె, చీరతో పాటు పట్టు వస్త్రాలు, పలు రకాల మిఠాయిలు, పండ్లతో పద్మశాలీలు, భక్తులు వెంట రాగా ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు వెంకటనగర్ నుంచి కల్యాణోత్సవ ప్రాంగణం వరకూ భారీ శోభాయాత్ర నిర్వహించారు.



కల్యాణం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు. వేదికపై భారీ సారె





కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పండితులు, కల్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు

### 40 వేల శ్రీవారి లడ్డూల వితరణ

కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తుల కోసం తిరుపతి నుంచి రప్పించిన 40 వేల లడ్డూల ప్రసాదంగా వితరణ చేశారు. కల్యాణోత్సవ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోతుందనే ముందస్తు అంచనాలతో బయట ఉండి భక్తులు వీక్షించేందుకు వీలుగా 15కు పైగా ఎల్‌ఈడీ స్క్రీన్‌లు కూడా ఏర్పాటు చేశారు. గడచిన ఐదు రోజులుగా స్వయంగా ఎమ్మెల్యే ద్వారంపూడి, ఆయన అనుచరులు, సన్నిహితులు ఈ కల్యాణోత్సవానికి దగ్గరుండి మరీ విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా కల్యాణ ప్రాంగణంలో ఎక్కడికక్కడ గ్యాలరీల్లోనే భక్తుల కోసం ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్నాక్స్, మంచినీరు వంటి సదుపాయాలు, టాయ్‌లెట్లు కూడా ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన కల్యాణోత్సవం రాత్రి 9.30 గంటల వరకూ వైభవోపేతంగా సాగింది. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ, ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న సాగర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, పలువురు ప్రముఖులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.



కల్యాణోత్సవానికి శోభాయాత్రగా వస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు

# వైఎస్సార్ సీపీ బలోపేతానికి కమిటీలు

- అనుబంధ విభాగాల నియామకం
- అధిష్టానం ఉత్తర్వులు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ అనుబంధ విభాగాలను మరింత బలోపేతం చేసే దిశగా వైఎస్సార్ సీపీ అడుగులు వేసింది. ఈ మేరకు ఆయా విభాగాల్లో పలువురు నేతలకు చోటు కల్పించింది. వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయతీరాల వైపు తీసుకుని వెళ్లే గురుతర బాధ్యతను వీరికి అప్పగించింది. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధిష్టానం ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### యూత్ అధ్యక్షుడిగా 'కొప్పన'

వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా కొప్పన శివనాథ్ (పిఠాపురం) నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా కనపర్తి వెంకట సుబ్రహ్మణ్యం (పెద్దాపురం), ఉంగడాల వీరబాబు (పిఠాపురం), కొప్పిశెట్టి గణేష్ (కాకినాడ రూరల్); జనరల్ సెక్రటరీలుగా బుద్ధా గణేష్ (ప్రత్తిపాడు), కాకినాడ సిటీ నుంచి బసవా అశోక్, తిరుమలశెట్టి లక్ష్మీకాంత్, యాసరపు పవన్, తునికి చెందిన నక్కా జాన్‌బాబు, ఏలూరి బాలు, అరిబోలు (జగ్గంపేట), కాకినాడ రూరల్‌కు చెందిన గీసాల వీరబాబు, చీకాల అప్పలరాజు; సెక్రటరీలుగా ప్రత్తిపాడుకు చెందిన బైర శ్రీరామమూర్తి, ఈగల గంగ, తునికి చెందిన యెన్నా శివకుమార్, కలిన గంగాధర్, పెద్దాపురానికి చెందిన దవులూరి రాంబాబు, గుండపునీడి వెంకట సుమన్, పిఠాపురానికి చెందిన తుంగల రమేష్, సానా నాగబాబు, కాకినాడ రూరల్‌కు చెందిన బొడ్డు శ్రీనివాస, రమేష్, వజ్రపు కామేష్; జాయింట్ సెక్రటరీలుగా ప్రత్తిపాడు నుంచి మర్రి చంద్రరావు, చింతకాయల వెంకటేష్, పెద్దాపురం నుంచి చిట్నీడి సుబ్బారావు, తూతిక అనికుమార్, కాకినాడ సిటీ నుంచి కొయ్యా త్రినాథ్‌రెడ్డి, జలగడుగుల పృథ్వీరాజ్, కాకినాడ రూరల్ నుంచి వనమాడి రాజు, గుత్తుల సూర్యప్రకాష్, జువ్వల కామేష్, అన్నంరెడ్డి మహేష్ (తుని), కొట్టేటి రాజేష్ (పిఠాపురం) నియమితులయ్యారు.

### రైతు విభాగం అధ్యక్షుడిగా ఉమారావు

జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా బొంగు ఉమారావు (తుని); ఉపాధ్యక్షులుగా జవ్వల నూకరాజు (ప్రత్తిపాడు), కాకినాడ రూరల్ నుంచి బండి పట్టాభిరామయ్య, అరవ శ్రీనివాసరావు; జనరల్ సెక్రటరీలుగా చింతంనీడి కుమార్ (ప్రత్తిపాడు), కేశినీడి శ్రీను (జగ్గంపేట), సిద్ధి సత్తిబాబు (పెద్దాపురం), గాడి గంగబాబు (పిఠాపురం), మద్దుకూరి వెంకట రామయ్య చౌదరి (తుని), నందిపాటి ధర్మరాజు (కాకినాడ రూరల్); సెక్రటరీలుగా తుని నుంచి ఇళ్ల శ్రీనివాసరావు, గూటూరు అప్పలరాజు, ప్రత్తిపాడు నుంచి అడపా వీరబాబు, సీమల వెంకన్నబాబు, పిఠాపురం నుంచి కమిడి గురయ్య, చెక్కా చినబాబు, పెద్దాపురం నుంచి రాయుడు శ్రీను, కట్టా శంకరరావు, అరిసే సత్యనారాయణ (జగ్గంపేట), కాకినాడ రూరల్ నుంచి పెంకే రాంబాబు, మామిడాల నాగచక్రం; జాయింట్ సెక్రటరీలుగా పెద్దాపురం నుంచి పాలచర్ల కల్యాణ్, ఉరదాసు రాజు, కోలమూరి వీరభద్రం, పిఠాపురం నుంచి వడిశెట్టి సత్యనారాయణ, వేగిశెట్టి సూరిబాబు, ప్రత్తిపాడు నుంచి నాగులాపల్లి బాబ్జి, రాకుమర్తి రాజారామ్మోహనరావు, కాకినాడ రూరల్ నుంచి గునపల్లి మాధవస్వామి, శీలం రమణ, ఆడారి మల్లేశ్వరరావు(తుని)ను నియమించారు.

### బీసీ విభాగ అధ్యక్షుడిగా 'ఈగల'

జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడిగా ఈగల అప్పారావు (ప్రత్తిపాడు); ఉపాధ్యక్షులుగా సంగాని నందం (కాకినాడ సిటీ), కోటా శ్రీను (కాకినాడ రూరల్); జనరల్ సెక్రటరీలుగా మజ్జూరి సూర్యనారాయణ (ప్రత్తిపాడు), కాకినాడ సిటీ నుంచి మన్నే నాగేశ్వరరావు, పెంకే రవి, బెజవాడ బాబీ, కోలా శివ (తుని), యెల్లపు నానాజీ (జగ్గంపేట), కానుబోయిన విజయకృష్ణ (పెద్దాపురం), తెడ్లపు చిన్నారావు (పిఠాపురం), కాకినాడ రూరల్ నుంచి కొత్తపల్లి గిరీష్, కోమలి సత్యనారాయణ, గింజాల నాగేశ్వరరావు; సెక్రటరీలుగా జగ్గంపేట నుంచి సబ్బా శ్రీను, రెసిబోయిన సత్యనారాయణ, పెద్దాపురం నుంచి సిద్ధాంతపు ప్రసాద్, నిడిగట్ల శ్రీనివాస్, గుమ్మడి దేవుడుబాబు, పిఠాపురం నుంచి పిర్ల గంగాధర్, గొంపా శ్రీను, కాకినాడ రూరల్ నుంచి గరికిన అప్పన్న, వాసంశెట్టి వెంకటరమణ, ప్రత్తిపాడు నుంచి పైలా శ్రీధర్, ఇంతంశెట్టి వెంకట సత్య రామ శివకుమార్, తుని నుంచి మేరపురెడ్డి నాయుడు, యనమల పంపా ప్రవీణ్; జాయింట్ సెక్రటరీలుగా కట్టా అన్నవరం (జగ్గంపేట), కాకినాడ సిటీ నుంచి మట్టపర్తి రఘురామ్, బొర్రా వెంకటేశ్వరరావు, ఇరుసుమిల్లి విష్ణు, పెద్దాపురం నుంచి రేలంగి రాంబాబు, కొత్తా నాగరాజు, పిఠాపురం నుంచి యేక సత్తిబాబు, రాజమహేంద్రవరపు సత్యనారాయణ, కాకినాడ రూరల్ నుంచి నేరెళ్ల శ్రీను, వాసంశెట్టి శ్రీను, ప్రత్తిపాడు నుంచి దేవ లక్ష్మణ్, బంటుపల్లి ప్రసాద్, లోకవరపు దేవి (తుని) నియమితులయ్యారు.

### వైద్య విభాగం అధ్యక్షుడిగా 'మాజేటి'

జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ మాజేటి మల్లికార్జున్ (కాకినాడ సిటీ); ఉపాధ్యక్షులుగా సఖిరెడ్డి విజయబాబు (ప్రత్తిపాడు); జనరల్ సెక్రటరీలుగా మురాలశెట్టి జగన్ (పిఠాపురం), బీవీఆర్ ప్రసాద్ (జగ్గంపేట); సెక్రటరీలుగా ప్రత్తిపాడు నుంచి వడ్ల సత్యనారాయణ, కాకి బాబ్జీ, పిఠాపురం నుంచి పెదిరెడ్ల రామకృష్ణ, బొండా సిద్ధార్థ; జాయింట్ సెక్రటరీలుగా పిఠాపురం నుంచి రత్నంగి కృష్ణ, బందారు సురేష్, ప్రత్తిపాడు నుంచి కాకర రాంబాబు, జగ్గపు వీర వెంకట సత్యనారాయణ నియమితులయ్యారు.

### రాష్ట్ర అనుబంధ విభాగాలకు..

పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లా నుంచి పలువురికి అవకాశం కల్పించారు. రాష్ట్ర సేవాదళ్ కమిటీలో జిల్లా నుంచి జనరల్ సెక్రటరీగా కాకినాడకు చెందిన మేడిది సుభాకరరావు, సెక్రటరీగా సీఎస్ఎన్ ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర లీగల్ సెల్ జనరల్ సెక్రటరీగా నక్కా రాందాస్, సెక్రటరీగా రాజాల చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీగా కొండా వెంకటరమణ నియమితులయ్యారు.

### మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బాషా

జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఎండీ బాషా (కాకినాడ సిటీ); ఉపాధ్యక్షులుగా షేక్ సందానీ, సయ్యద్ ఖాజా నదీమ్ మహ్మద్ (కాకినాడ రూరల్); జనరల్ సెక్రటరీలుగా షేక్ చెల్లారావు (ప్రత్తిపాడు), కాకినాడ సిటీ నుంచి షేక్ రాజుద్దీన్, ఎండీ జలాలుద్దీన్, ఎండీ కరీముల్లా, షేక్ సలీం (తుని), షేక్ శ్రీను (పెద్దాపురం), షేక్ బాబ్జీ (పిఠాపురం); సెక్రటరీలుగా ప్రత్తిపాడు నుంచి షేక్ సైదాబీ, ఎండీ అల్తాఫ్, తుని నుంచి షేక్ మహబూబ్ బాషా, షేక్ నూకరాజు, పెద్దాపురం నుంచి మహ్మద్ షోయబ్, పి.చందన్ హుస్సేన్, పిఠాపురం నుంచి షేక్ ఇబ్రహీం, మహ్మద్ తాజుద్దీన్, కాకినాడ రూరల్ నుంచి మహ్మద్ మహబూబ్ షరీఫ్, సయ్యద్ మదీనా బాషా; జాయింట్ సెక్రటరీలుగా ప్రత్తిపాడు నుంచి షేక్ బాబ్జీ, బందిలి వీరబ్బాయి, కాకినాడ సిటీ నుంచి ఎండీ ఖలీముద్దీన్, అబ్దుల్ రహీం, షేక్ ఖాదర్ మొహిద్దీన్, తుని నుంచి షేక్ నానిబాబు, పెద్దాపురం నుంచి మహ్మద్ మున్వర్ కుర్సీ, మహ్మద్ అహ్మద్ ఆలీ, పిఠాపురం నుంచి మహ్మద్ మహబూబ్ రెహ్మాన్, షేక్ బాబ్జీ, కాకినాడ రూరల్ నుంచి షేక్ మదీనా, షేక్ జానీలను నియమించారు.

## క్లుప్తంగా

### అంతర్వేదికి 40 ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపో నుంచి అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణం, రథోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి శుక్రవారం తెలిపారు. 19 తేదీన ఉదయం నుంచి 20వ తేదీ రాత్రి రథోత్సవం అయ్యే వరకు అమలాపురం – అంతర్వేది, అప్పనపల్లి – అంతర్వేది, పల్లం –అంతర్వేది రూట్‌లలో ప్రయాణికుల కోసం 40 ప్రత్యేక బస్సులు నడుపుతునట్లు తెలిపారు.

### యుఆర్ హోంమాల్ ప్రారంభం



హోంమాల్‌లో డేఫిల్ స్టూడియోను తిలకిస్తున్న సినీ దర్శకుడు రాజమౌళి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోనే అతి పెద్ద కంప్లీట్ హోం సొల్యూషన్స్ రిటైల్ షోరూమ్ 'యుఆర్ హోంమాల్'ను సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి శుక్రవారం ప్రారంభించారు. మోరంపూడి జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన మాల్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హోంమాల్ టీమ్ హేఫిల్ డిజైనర్స్ స్టూడియో కడియాల గోపాలకృష్ణ, కడియాల రఘు, డెకార్ అండ్ డెకార్స్ పాలిక వెంకటరమణ (కళాంజలి శ్రీనివాస్), పాలిక రామకృష్ణ, పున్నమి వెంకట సత్యనారాయణ, రాజమండ్రి ఇన్నోవేషన్స్ కందుల జగన్, శ్రీ హర్ష సామంతుల, సీహెచ్ రమేష్ మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి మాడ్యులర్ కిచెన్స్, వార్డ్‌రోబ్స్ హార్డ్‌వేర్ ఉత్పత్తులు, టైల్స్, ఆర్కిటెక్చరల్ ఉత్పత్తులు, లైటింగ్స్, లగ్జరీస్ సోఫాస్, బ్లాంకో సింక్‌లు, కుళాయిలు, హోమ్ అప్లయన్సెస్ లభిస్తాయని తెలిపారు. మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి భవానీ, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, తోట త్రిమూర్తులు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రుడా చైర్‌పర్సన్ రౌతు సూర్యప్రకాశ రావు పాల్గొన్నారు.

# ఆదిలోనే హంసపాదు

- సత్యదేవుని నూతన రథం ప్రారంభం
- సాంకేతిక కారణాలతో ఊరేగింపు వాయిదా



నూతన రథాన్ని ప్రారంభిస్తున్న ఈఓ రామచంద్రమోహన్, పండితులు

అన్నవరం: ఆదిలోనే హంసపాదు అన్నట్టు.. సత్యదేవుని నూతన రథం ప్రారంభమైన వేళ.. స్వామి ఊరేగింపునకు సాంకేతిక కారణాలు ఆటంకంగా నిలిచాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో అధికారులు రథాన్ని ప్రారంభించి, ఊరేగింపును వాయిదా వేశారు. వివరాలివీ.. రూ.34 లక్షల వ్యయంతో నిర్మించిన సత్యదేవుని నూతన టేకు రథాన్ని రథసప్తమి పర్వదినాన ప్రారంభించి.. దానిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని వేంచేయించి, ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఊరేగించాలని పండితులు నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా కొత్త రథానికి దేవస్థానం పండితులు, ఈఓ కె.రామ చంద్ర మోహన్ శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు రథంపై కలశ స్థాపన కూడా చేశారు. అనంతరం ఆ రథాన్ని ట్రాక్టర్‌కు కట్టి రత్నగిరికి చేర్చేందుకు సిద్ధం చేశారు.

**అవాంతరాలు ఎదురయ్యాయిలా..**

- నూతన రథాన్ని ట్రాక్టర్ సాయంతో రెండో ఘాట్ రోడ్డు మీదుగా ఆదిశంకర మార్గ్‌కు తీసుకువచ్చారు. అక్కడ స్పీడ్ బ్రేకర్ల పైనుంచి వెళ్తున్న సమయంలో రథం వెనుక చక్రాల పక్కన ఉన్న రాడ్డు విరిగిపోయింది. దీంతో రథం నిలిచిపోయింది. అనంతరం ఆ రాడ్డును తొలగించి సపోర్టుగా మరో రెండు రాడ్లు వేశారు. అనంతరం 12 గంటలకు రత్నగిరి పశ్చిమ రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు.
- పశ్చిమ రాజగోపురం పక్కన ఉన్న మార్గం గుండా ఆలయ ప్రాంగణంలోకి రథాన్ని తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, ఆ మార్గం కన్నా రథం వెడల్పు ఎక్కువగా ఉంది. రథం 12 అడుగుల పొడవు, 7.4 అడుగుల వెడల్పు ఉండగా.. ఆ మార్గం వెడల్పు 7 అడుగులు మాత్రమే ఉంది. దీంతో రథాన్ని లోపలకు తీసుకువెళ్లడం సాధ్యం కాలేదు. దీంతో రథాన్ని విడదీసి ఆ భాగాలను లోపలకు తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. అది కూడా కుదరలేదు.
- ఇంజినీరింగ్ అధికారుల్లో ముందుచూపు లోపించడంతో ఈ సమస్య తలెత్తింది. రథం పొడవు, వెడల్పును బట్టి ఆ మార్గంలో అది లోపలకు వెళ్తుందో లేదో ఇంజినీరింగ్ అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఒకవేళ రథం లోపలకు వెళ్లలేని పరిస్థితి ఉంటే, దాని విడి భాగాలను ఆలయ ప్రాంగణంలోకి తరలించి, అక్కడే బిగించి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదు. ఈ ఆటంకాలకు కారకులైన సంబంధిత అధికారులపై ఈఓ రామచంద్ర మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆకాశంలో విహరించిన రథం**

సుమారు టన్ను బరువు కలిగిన ఈ రథాన్ని చివరకు బెల్టులతో క్రేన్‌కు తగిలించి, సుమారు 30 అడుగుల ఎత్తుకు లేపి, గంటసేపు ప్రయత్నించిన అనంతరం రాజగోపురం లోపలి వైపు ప్రాంగణంలోకి దింపారు. నేల మీద ఊరేగాల్సిన రథం కాస్తా స్వామి, అమ్మవారు లేకుండా క్రేన్ సాయంతో ఆకాశంలో విహరించడంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. రథాన్ని సురక్షితంగా కిందకు దించిన క్రేన్ ఆపరేటర్‌ను ఈఓ అభినందించారు. అప్పటికి సమయం మధ్యాహ్నం 1.30 గంటలైంది. అప్పటికే ముహూర్తం మించిపోవడంతో నూతన రథంలో స్వామివారి ఊరేగింపును వాయిదా వేశారు. ఆలయ ప్రాంగణంలో నీడ కోసం కట్టిన గ్రీన్ షేడ్స్ క్లాత్ కూడా తగులుతూండటంతో రథాన్ని నైరుతి వ్రత మండపం వద్ద నిలిపివేశారు. మరో ముహూర్తంలో స్వామి, అమ్మవారిని ఊరేగించాలని నిర్ణయించారు. ఈలోగా గ్రీన్ షేడ్ క్లాత్ ఎత్తును మరో రెండడుగుల మేర పెంచాలని ఈఓ రామచంద్ర మోహన్ ఆదేశించారు. దేవస్థానం ఈఈ మురళి, డీఈలు బీఎస్ రాంబాబు, ఉదయ్, ఏఈఓలు కృష్ణారావు, పెద్ద సంఖ్యలో సిబ్బంది, వైదిక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రథాన్ని రాజగోపురం లోపలకు క్రేన్‌తో తీసుకుని వెళ్తున్న దృశ్యం

### ఉపాధ్యాయుల ప్రవర్తనపై విద్యార్థినుల ఫిర్యాదు

గొల్లలగుంట హైస్కూల్‌లో విచారణ నిర్వహించిన డీవైఈఓ



గొల్లలగుంట ఉన్నత పాఠశాలలో విచారణకు వచ్చిన అధికారులు

జగ్గంపేట: మండలంలోని గొల్లలగుంట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవరిస్తున్నారన్న ఆరోపణలపై జిల్లా అధికారుల ఆదేశాలతో విద్యాధికారులు శుక్రవారం విచారణ నిర్వహించారు. జగ్గంపేట ఎంఈఓ స్వామి అందించిన వివరాల ప్రకారం కొద్ది రోజుల క్రితం సోషల్ ఆడిట్‌కు వచ్చిన అధికారుల వద్ద 9,10 తరగతుల విద్యార్థినులు ఇద్దరు ఉపాధ్యాయులు తమ పట్ల ప్రవర్తించే తీరుపై ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. డీఈఓ ఆదేశాలతో డీవైఈఓ ఆర్‌జేడీ రాజు, కరప ఎంఈఓ కృష్ణవేణి గొల్లలగుంట హైస్కూల్‌లో విచారణ చేపట్టారన్నారు. విద్యార్థినులకు ప్రశ్నావళి ఇచ్చి వాటిని పూర్తి చేయించి పట్టుకెళ్లారని తెలిపారు. వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తారని తెలిపారు. గొల్లలగుంటకు చెందిన సాయిరాం, శ్యామ్ అనే ఉపాధ్యాయుల ప్రవర్తనపై ఫిర్యాదులు వచ్చాయని ఎంఈవో వివరించారు.

### నాల్గవ ఖేల్ ఇండియా కబడ్డీ సమన్వయకర్తగా శ్యామ్‌కుమార్



శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కేంద్ర యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో అస్సాం గౌహతీనగర్‌లో శనివారం నుంచి 22 వరకూ నిర్వహించే 4వ ఖేలో ఇండియా కబడ్డీ పోటీల సమన్వయకర్తగా జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ ఉత్తర్వులు జారీచేయగా శుక్రవారం వర్సిటీ ఆవరణలో జేఎన్‌టీయూకే ఉపకులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అభినందించారు. గత ఏడాది నిర్వహించిన 3వ ఖేలో ఇండియా గేమ్స్‌కు శ్యామ్‌కుమార్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించి విజయవంతం చేశారని, ఈ ఏడాది అదే రీతిలో విజయవంతం చేయాలని కోరారు. శ్యామ్‌కుమార్‌ను అభినందించిన వారిలో వర్సిటీ రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్. సుమలత, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది ఉన్నారు.

# లక్ష్మీ నృసింహుని కల్యాణోత్సవాలకు శ్రీకారం

- అంతర్వేదిలో మొదలైన సందడి
- పెళ్లికొడుకుగా ముస్తాబైన స్వామి
- సూర్య, చంద్రప్రభ వాహనాలపై సేవ



స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తున్న అర్చకులు



చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో శ్రీలక్ష్మీనృసింహస్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సూర్య భగవానుడి జన్మదినం రోజైన రథసప్తమిని పురస్కరించుకుని స్వామివారిని వరుడిగా, అమ్మవారిని వధువుగా అలంకరించారు. ఏటా మాదిరిగానే ముద్రికాలంకరణ(శ్రీవారిని పెండ్లికుమారుని, అమ్మవారిని పెళ్లికుమార్తె చేసే కార్యక్రమం)ను కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాల వారు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు శ్రీవారికి, అమ్మవారికి వైఖానస ఆగమానుసారం, శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రకారం విశేష పూజలు చేశారు. మామిడాకుల భస్మంతో బుగ్గన చుక్కపెట్టి, ఉంగరం తొడిగి పెండ్లికుమారుని, పెళ్లికుమార్తెను చేసే తంతును రమణీయంగా పూర్తిచేశారు. కల్యాణోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అర్చకులు, వేద పండితులు, ప్రముఖులు రథానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆలయం వద్ద నుంచి రథాన్ని గోవింద నామస్మరణల మధ్య మెరకవీధికి తోడ్కొని వెళ్లారు. ఉత్సవాల తొలిరోజు సాయంత్రం సూర్యవాహనంపైన, రాత్రి చంద్రప్రభ వాహనంపైన కొలువుదీరిన స్వామి మాఢవీధుల్లో ఊరేగారు. గ్రామోత్సవాల్లో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**అంతర్వేదిలో నేడు.....**

అంతర్వేది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం గరుడు పుష్పక వాహనంపైన, రాత్రి పుష్పక వాహనంపైన శ్రీస్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ శ్రీస్వామివారి తిరువారాధన, అర్జిత అభిషేకం, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ శ్రీసుదర్శన హోమం నిర్వహించనున్నారు.



# వైభవంగా రథోత్సవం

- జి.మామిడాడలో ఘనంగా రథసప్తమి
- పోటెత్తిన భక్తులు



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు



జి.మామిడాడలో సాగిన రథోత్సవం

పెదపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి వారి రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. సూర్యభగవానుడి పుట్టిన రోజైన రథసప్తమి పర్వదినం సందర్భంగా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు రథోత్సావాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 122 సంవత్సరాల చరిత్ర గల సూర్యదేవాలయంలో స్వామి దర్శనాన్ని భక్తులు సెంటుమెంటుగా భావిస్తారన్నారు. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత అర్చకులు.. సూర్యభగవానుడు, ఆయన దేవేరులైన ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయం బయట ఉంచిన రథంలో ఉత్సవ మూర్తులను పెట్టారు. అనంతరం అర్చకులు అష్ట దిక్పాలిక బలిహరణం చేసి, రథోత్సం ప్రారంభించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డితో పాటు ఆలయ ఉత్సవ కమిటీ, గ్రామ యూత్ సభ్యులు, భక్తులు సూర్యనారాయణ నామస్మరణతో ఉత్సాహంగా రథాన్ని ముందుకు లాగారు.

# బషీర్ బీబీ ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

**భారీగా తరలి వచ్చిన భక్తులు**



బషీర్‌బీబీ ఆలయం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముజావర్లు

కొత్తపల్లి: మండలం పొన్నాడలో వేంచేసియున్న బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ) ఔలీయా 69వ ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంథల్ (గంధం) తీసి అమ్మవారికి పూయడంతో ఉత్సవాల్ని ముజావర్లు ప్రారంభించారు. మూడు రోజులపాటు వైభవోపేతంగా జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి కులమత భేదాలు లేకుండా వేలాది మంది భక్తులు ఇప్పటికే పొన్నాడ చేరుకున్నారు. వీరంతా అమ్మవారి ఆలయం పరిసర ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని మూడు రోజులపాటు ఇక్కడే ఉండి ఉత్సవాల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే వేలాది మంది పొన్నాడ చేరుకున్నారు. ఆదివారం సంథల్ (గంధం) ఉత్సవంతో ముగియనున్న ఈ ఉత్సవాల్లో గంధోత్సవం అత్యంత ప్రధానమైనది. గంధోత్సవం కోసం స్థానిక ముజావర్లు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీరోజూ ఖురాన్‌ఖాని, వాచ్, మిలాద్ షరీఫ్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బషీర్‌బీబీ ముస్లింల దేవతైనప్పటికీ అన్ని మతాలు, కులాలకు చెందిన భక్తులు దర్శించుకోవడం వల్ల ఈ ఉత్సవాన్ని మత సామరస్యానికి చిహ్నంగా చెబుతుంటారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# విలువలతో కూడిన విద్యే ధ్యేయం



విద్యాసంస్థలను ప్రారంభిస్తున్న చైర్మన్ తిరుమలరావు

పాయకరావుపేట: రాజమహేంద్రవరం తిరుమల విద్యా సంస్థల నూతన శాఖను అడ్మిన్‌స్ట్రేటివ్ ఆఫీస్‌ను స్థానిక మెయిన్‌రోడ్డులో డీసీసీ బ్యాంకుపైన ఏర్పాటు చేశారు. దీన్ని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికీ అందించాలనే సదుద్దేశంతో తిరుమల విద్యా సంస్థలను స్థాపించామన్నారు. పాయకరావుపేట, తుని చుట్టుపక్కల పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషుల కోరిక మేరకు పాయకరావుపేటలో పి.ఎల్.పురం సెంటర్ హైవే పక్కన తమ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ క్యాంపస్‌లో ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి, జూనియర్ ఇంటర్ డే స్కాలర్ తరగతులు నిర్వహిస్తామన్నారు. అడ్మిషన్లు లేదా ఇతర వివరాల కోసం 8008478777, 8520926777 నంబర్లలో సంప్రదించాలని కోరారు. డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి పాల్గొన్నారు.

# బాకీ తీరుస్తామని చెప్పి టోకరా



నిందితులతో అన్నవరం ఎస్‌ఐ కిషోర్, తదితర పోలీసులు



ఫిర్యాదుదారుకు నిందితులు ఇచ్చిన బ్లాక్ నోట్లు, కెమికల్ బాటిల్స్

అన్నవరం: నల్ల కాగితాలకు కెమికల్ పూస్తే అవి రూ.500 నోట్ల కరెన్సీ నోట్లు అవుతాయని చెప్పి టోకరా వేయబోయిన పిఠాపురానికి చెందిన ముఠాను అన్నవరం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. గతంలో తన వద్ద తీసుకున్న రూ.20 లక్షల నగదు తిరిగి ఇస్తామని చెప్పి, కొన్ని నల్ల కాగితాల కట్టలు, కెమికల్ బాటిల్స్ ఇచ్చి మోసం చేశారని బిక్కవోలు మండలం పందలపాకకు చెందిన అనుసూరి రాజబాబు ఇచ్చిన ఫిర్యాదుపై నలుగురిని శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ వి.కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం పిఠాపురానికి చెందిన ఈటి జగదీష్, కూరాకుల గంగా మహేశ్వర, అల్తి వీర్రాజు, పిట్టా రాజేంద్ర కుమార్ పందలపాకకు చెందిన అనుసూరి రాజబాబుకి రూ.20 లక్షలు బాకీ పడ్డారు. ఆ బాకీ చెల్లిస్తామని చెప్పి స్థానిక డిగ్రీ కళాశాల వద్దకు శుక్రవారం మధ్యాహ్నం ఆటోలో వచ్చారు. అక్కడ ఆయనకు నలుపు రంగు పూసిన కాగితాలతో కూడిన కట్టలు, ఒక బాటిల్ లిక్విడ్ ఇచ్చారు. ఆ లిక్విడ్ ఆ నల్లనోట్లకు పులిమితే అవి రూ.500 ఒరిజనల్ కరెన్సీగా మారతాయని చెప్పి మోసగించాలని యత్నించారు. గతంలో కూడా ఇలాగే తనను నమ్మించి మోసగించడంతో నిందితుడు ముందుగానే పోలీసులను ఆశ్రయించాడు. దీంతో జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్ ఆదేశాల ప్రకారం పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సీఐ ఎస్. లక్ష్మణరావు, స్థానిక ఎస్‌ఐ వి.కిషోర్ చాకచక్యంగా నిందితుల ఆటోపై దాడి చేసి ఆ నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి నలుపురంగు పూసిన నోట్ల కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. వారు ప్రయాణించిన ఆటో, మోటార్ సైకిల్ కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.